# నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, శుక్రవారం 19 జూలై 2024 | NIZAMABAD


## నిజామాబాద్‌కు రూ.226 కోట్లు

● రుణమాఫీ నిధులు విడుదల చేసినట్లు వీసీలో వెల్లడించిన సీఎం

బోధన్, జూలై 18: రుణమాఫీలో భాగంగా తొలివిడుత నిజామాబాద్ జిల్లాకు రూ.226కోట్లను బ్యాంకుల్లో జమ చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. రైతులకు రూ.లక్ష లోపు రుణమాఫీ చేసిన సందర్భంగా గురువారం సాయంత్రం హైదరాబాద్ నుంచి వీసీలో మాట్లాడారు. బోధన్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులతో సీఎం రేవంత్ ముఖాముఖి మాట్లాడారు. కార్యక్రమంలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతీశరత్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్ సంకేత్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సహకార సంఘాల చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి, బోధన్ ఆర్డీవో అంబదాస్ రాజేశ్వర్, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

**రవీ..అంకాపూర్ చికెన్ తినిపిస్తావా..**

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో రైతు మందర్న రవి మాట్లాడారు. రుణమాఫీ చేసిన మీకు రైతులంతా ఎంతో రుణపడి ఉంటారని సీఎంపై ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా సీఎం ముసిముసి నవ్వులు నవ్వుతూ.. 'రవీ ..రైతు రుణమాఫీ చేసినందుకు అంకాపూర్ చికెన్ తినిపిస్తావా..' అని అడిగారు. అందుకు రవి 'తప్పకుండా సార్.' అంటూ సమాధానం ఇచ్చారు.


సీఎం రేవంత్‌రెడ్డితో వీసీలో మాట్లాడుతున్న రైతు రవి, చిత్రంలో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, కార్పొరేషన్ల చైర్మన్లు

## కామారెడ్డిలో రూ.235.61 కోట్ల మాఫీ


రైతువేదికలో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ

కామారెడ్డి, జూలై 18 : జిల్లాలో 49,541 మంది రైతులకు రూ.235 కోట్ల 61 లక్షలు మాఫీ చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వీసీలో తెలిపారు.కామారెడ్డి మండలం క్యాసంపల్లి రైతువేదికలో నిర్వహించిన వీసీలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్లు, రైతులతో మాట్లాడారు. రుణమాఫీకి అర్హత ఉండి ఏదైనా సాంకేతిక కారణాలతో జాబితాలో లేని రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని, డీఏవోలో హెల్ప్‌లైన్ 7288894616 నంబర్‌ను ఏర్పాటు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు.

# మాఫీ కొందరికే..


మోపాల్ మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన వీసీలో రైతులు లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు



- ఆందోళనలో మిగతా రైతాంగం
- లక్షలోపు తీసుకున్న లోన్లలో చాలామందికి వర్తించని పథకం
- తొలి విడుతలో సగం మందికే రుణమాఫీ
- ఉమ్మడి జిల్లాలో 86వేల కుటుంబాలకు లబ్ధి
- రూ.461 కోట్లు బ్యాంకులకు విడుదల
- రైతులను కలవరపెడుతున్న ప్రభుత్వ కొర్రీలు
- తమకెప్పుడు వస్తుందోనని ఎదురుచూపులు

నిజామాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రూ.లక్ష లోపు రుణం మాఫీ అవుతుందని ఆశగా ఎదురుచూసిన ఉమ్మడి జిల్లా రైతాంగానికి తొలిరోజు నిరాశే మిగిలింది. కాంగ్రెస్ సర్కారు గురువారం ప్రారంభించిన పంట రుణాల మాఫీ పథకంలో భాగంగా సగం మందికే లబ్ధి కలిగింది. లక్షలాది మంది రైతుల లోన్లు మాఫీ కాలేదని తెలిసింది. వారికి ఎప్పుడు ఇస్తారనేది స్పష్టత కరువైంది. తొలి విడుతలో రూ.లక్ష లోపు పంట రుణాలను మాఫీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా మంత్రులు, కాంగ్రెస్ నేతలు ప్రకటనలు చేశారు. కానీ, అమలులోకి వచ్చే సరికి కొందరి లోన్లే మాఫీ కావడం, మిగతా వారికి కాకపోవడంతో రైతాంగంలో ఆందోళన నెలకొన్నది. తొలిరోజు ఉమ్మడి జిల్లాలోని 86,764 కుటుంబాలకు సంబంధించిన పంట రుణాల మొత్తం రూ.461 కోట్లను ప్రభుత్వం బ్యాంకులకు విడుదల చేసింది. అయితే, సర్కారు మార్గదర్శకాల ప్రకారం ఉమ్మడి జిల్లాలో లక్షలాది మంది రైతులు అర్హులు కాగా, వేల సంఖ్యలోనే రైతులకు మాఫీ వర్తించడం చర్చనీశమైంది. కుటుంబం యూనిట్‌గా తీసుకుని రుణాలను మాఫీ చేయడం ద్వారా చాలా మందికి నష్టం వాటిల్లింది.

**మిగితా వారికెప్పుడో..?**

తొలి విడుతలో 86,764 కుటుంబాలకు సంబంధించిన రుణాలు మాఫీ అయ్యాయి. కానీ, పంట రుణాలు తీసుకున్న వారి సంఖ్య అంతకు మూడు రెట్లు ఉన్నప్పటికీ, వారందరికీ మాఫీ కాలేదు. ఇందులో సన్న, చిన్నకారు రైతులు కూడా ఉండడంతో వారంతా తీరని మనోవేదనకు గురయ్యారు. రైతులపై రుణ భారాన్ని తగ్గించేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమంలో ప్రధానంగా ప్రభుత్వమే తమపై ఉన్న భారాన్ని వదిలించుకునేందుకు తహతహలాడినట్లుగా కనిపిస్తున్నది.

**షరతులు వర్తించాయ్!**

రుణమాఫీ హామీ అమలు చేయడంలో కాంగ్రెస్ ద్వంద నీతిని అవలంభించింది. పథకం అమలు కోసం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు రైతులను బురిడీ కొట్టించి అనేక మందికి మాఫీ కాకుండా చేసినట్లైంది. డిసెంబర్ 12, 2018 నుంచి డిసెంబర్ 9, 2023 వరకు తీసుకున్న పంట రుణాలన్నీ రద్దు చేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ, కుటుంబంలో ఒకరికే వర్తింపజేసినట్లు తెలిసింది. ఒకింట్లో వారసులు ఇద్దరు కన్నా ఎక్కువ ఉండి రేషన్ కార్డు లేకపోతే వారిలో ఒకరికే వర్తించింది. కిసాన్ సమ్మాన్ యోజనకు అర్హులైన వారందరినీ ఇందుకు ప్రామాణికంగా తీసుకోవడంతో ఐటీ చెల్లింపుదారులకు రుణమాఫీ షాక్ తగిలింది. గతంలో కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు షరతుల్లేకుండా రుణమాఫీ అమలు చేసింది. వ్యవసాయ భూములపై వివిధ బ్యాంకుల్లో తీసుకున్న రుణాలన్నింటినీ రద్దు చేసి పెద్ద మనసును చాటుకున్నారు. కానీ, రేవంత్ సర్కారు మాత్రం అడుగడుగునా రైతులను దగా చేసేందుకు ప్రయత్నించినట్లు కనిపిస్తున్నది.

**రుణమాఫీ లబ్ధిదారుల వివరాలు..**

| జిల్లా | లోన్ అకౌంట్లు | కుటుంబాలు | మాఫీ అయిన మొత్తం (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| నిజామాబాద్ | 44,469 | 41,474 | 225.62 |
| కామారెడ్డి | 50,095 | 45,290 | 235.61 |

### రూ.30 వేలే అయినా.. రుణమాఫీ జాబితాలో పేరు లేదు..



బోధన్, జూలై 18: ఇతని పేరు చింతల పెద్ద లక్ష్మన్, స్వగ్రామం ఎడపల్లి. తనకున్న చిన్నమొత్తానికి బ్యాంకు ద్వారా రూ. 31వేల రుణాన్ని పొందాడు. రుణమాఫీ జరగాలంటే లోన్ రెన్యువల్ చేసుకోవాలని అధికారులు చెబితే రెన్యువల్ చేయించుకున్నాడు. అయితే, రూ.లక్షలోపు రుణాలు గురువారం మాఫీకి చెందిన లిస్ట్‌ను బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులకు అందిస్తే అందులో లక్ష్మన్ పేరు లేదు. దీంతో తనకన్నా ఎక్కువ మొత్తంలో రుణం ఉన్నవారి పేరు మాఫీ లిస్ట్‌లో ఉన్నా.. తన పేరు లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తన పేరు ఎందుకు లేదో నాకు అర్థం కావడం లేదని, రుణమాఫీకి తాను అనర్హుడిని అయితే, తనకు నోటీసులు ఎందుకు పంపారని ప్రశ్నిస్తున్నాడు.

*పంట రుణమాఫీ ప్రక్రియను ప్రభుత్వం గురువారం ప్రారంభించింది. అయితే, తొలి విడుతలో రూ.లక్షలోపు రుణాలన్నీ మాఫీ చేస్తున్నట్లు ప్రకటించిన కాంగ్రెస్ సర్కారు ఆచరణలో విఫలమైంది. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే సగం మందికి మాత్రమే లబ్ధి జరిగినట్లు తెలిసింది. ఉమ్మడి జిల్లాలో లక్షలాది మందికి రుణమాఫీ కాలేదని తేలింది. వారికి ఎప్పుడు మాఫీ చేస్తారన్నది స్పష్టత కరువైంది. దీంతో రైతాంగం ఆందోళన చెందుతున్నది. రూ.లక్ష లోన్ తీసుకున్నామని, తమకు మాఫీ వర్తించలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.*

**లబోదిబోమంటోన్న రైతులు..**

బ్యాంకుల నుంచి పంట రుణాల వివరాలు సేకరించి, రేషన్ కార్డు ఆధారంగా వారి కుటుంబాన్ని నిర్ధారించి ఆ కుటుంబంలోని సభ్యులందరికీ కలిపి బ్యాంకు ఇచ్చిన రుణంలో రూ.2లక్షలు రుణమాఫీ వర్తింపజేసేలా ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించింది. ప్రతి రైతుకు రూ.2 లక్షల స్వల్పకాలిక పంట రుణమాఫీ హామీ మొదటికే మోసమైంది. రైతు రుణమాఫీ కాస్తా రైతు కుటుంబ రుణమాఫీగా మార్చేశారు. కుటుంబం అనే నిబంధనతో మోసపోయామని చాలా మంది రైతులు బాధపడుతున్నారు. కొత్త రేషన్ కార్డుల పంపిణీ, పాత వాటిలో మార్పులు, చేర్పులకు అవకాశం లేనందున విడిపోయిన రైతు కుటుంబాల పేర్లు ఒకే కార్డులో ఉన్నాయి. తద్వారా ఉమ్మడి కుటుంబంలో విడివిడిగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి తీవ్ర నష్టం జరిగింది. కరువు ప్రాంతాలుగా ప్రకటించిన మండలాల్లో బ్యాంకులు పాత రుణాలను రీషెడ్యూల్ చేసి కొత్త పంటలకు రుణాలను ఇస్తాయి. రీషెడ్యూల్ చేసిన పంట రుణాలకు న్యాయంగా మాఫీ జరగాల్సి ఉండగా అది కూడా వర్తించలేదని రైతులు లబోదిబోమంటున్నారు.

**మాఫీ కాని రైతులు పెద్ద సంఖ్యలోనే.. (ఉదాహరణకు)**

| | | |
|---|---|---|
| జిల్లా పేరు | : | నిజామాబాద్ |
| మండలం | : | కోటగిరి |
| గ్రామం | : | కోటగిరి |
| రూ.లక్ష వరకు రుణమాఫీ అయిన రైతులు | : | 416 |
| రూ.లక్ష వరకు రుణమాఫీ కాని రైతులు | : | 356 |

### రుణ మాఫీకి తిరకాసులు పెట్టొద్దు



కోటగిరి, జూలై 18: నాకు మల్కాపూర్ శివారులో 1.23ఎకరాలు భూమి ఉన్నది. పంట సాగు కోసం నాలుగేండ్ల క్రితం రూ.44వేలు పంట రుణం తీసుకున్న. సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేస్తామంటే గత ఏడు నెలల నుంచి ఎదురుచూస్తున్నా. గురువారం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు. సంబంధిత శాఖ వారికి అడిగితే సరైనా సమాధానం చెప్పడం లేదు. రుణమాఫీ గురించి ఎవరిని అడగాలి. రైతులకు రుణమాఫీ చేస్తామని చెబుతున్నారు కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే అధికారుల తప్పిదంతో హామీలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. అధికారులు స్పందించి తన పేరిట ఉన్న రుణం మాఫీ అయ్యేలా చూడాలని కోరుతున్నా.

**-నార్ల సాయి శ్రీనివాస్, రైతు, కోటగిరి**

### ఎప్పుడు వస్తదో ఏమో..



భీమ్‌గల్, జూలై 18: ఎన్నికలప్పుడు ఒకేసారి రెండు లక్షలు మాఫీ అని చెప్పిండు. ఇప్పుడు మూడు విడుతలు అని రైతులను ఆగం చేస్తుండు. ఎవరికి వస్తదో రాదో అని రైతులందరం ఆగమైతున్నం. బ్యాంకులల్ల వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నాం. మాఫీ వస్తదని ఎదురుచూస్తున్నం. అందరికీ ఒకేసారి చేస్తే మంచిగా ఉంటది.

**- శర్మానాయక్, రైతు,రహత్‌నగర్**

### రూ.60 వేలు తీసుకున్నా మాఫీ కాలేదు..



బోధన్ రూరల్, జూలై 18: నాకున్న ఎకరం భూమికి రూ.60వేల రుణం తీసుకున్నా. అయితే, మాఫీ వస్తుందని ప్రభుత్వం చెప్పడంతో చాలా సంతోషం వేసింది. గురువారం పగటి వరకు లిస్ట్ వచ్చినా, అందులో నాపేరు లేదు. దీంతో బాధగా అనిపించింది. అసలే వర్షాలు సకాలంలో కురవక, పంట వేసినా పరిస్థితి ఆగమాగమవుతున్న సమయంలో అప్పు మాఫీ అవుతుందని సంతోషపడ్డా. వ్యవసాయశాఖ అధికారులకు అడిగితే, బ్యాంకర్లు పంపిన పేర్లు, వారి నిబంధనల మేరకు లోన్ల మాఫీ లిస్టు మాకు వచ్చిందని చెబుతున్నారు.

**- ఆర్. ఫకీరా నాయక్, రైతు, రాజీవ్‌నగర్‌తండా, బోధన్ మండలం**

### జాబితాలో నా పేరు రాలేదు..



మాక్లూర్, జూలై 18: లక్షలోపు ఉన్న రైతులందరికీ రుణమాఫీ చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినా.. మొదటి రోజు ప్రకటించిన జాబితాలో నా పేరు లేదు. గతేడాది ఆగస్టులో ఇండియన్ బ్యాంకులో రూ.50వేలు పంట రుణం తీసుకున్న. రూ.లక్ష లోపు ఉన్న రైతులందరికీ మొదటి రోజు మాఫీ డబ్బులు వేస్తున్నామని ప్రభుత్వం చెప్పింది.కానీ నాకు రాలేదు.

**- న్యాలకంటి భోజన్న, రైతు, ముల్లంగి(బీ)**

### అందరికీ ఒకేసారి అని చెప్పిండు..



భీమ్‌గల్, జూలై 18: రుణమాఫీ కోసం ఏడు నెలల నుంచి ఎదురుచూస్తున్నాం. చివరికి గురువారం సీఎం రేవంత్‌రెడ్డి రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేసిండు. కానీ అందరికీ ఒక్కసారే చేస్తా అని చెప్పి.. ఇప్పుడు రెండో విడుత, మూడో విడుత అంటున్నాడు. ఎప్పుడు వస్తాయోనని ఎదురుచూసుడే ఉన్నది.

**-మూత లింబాద్రి, రైతు, భీమ్‌గల్**

### మా ఊళ్లో చాలా మందికి మాఫీ కాలేదు



నవీపేట, జూలై 18: మొదటి విడుత రూ.లక్ష రుణమాఫీ లిస్టులో నా పేరు రాలేదు. చాలా బాధగా అనిపించింది. నాకు ఎకరం భూమి ఉన్నది. గతేడాది ఆగస్టులో జన్నేపల్లి కెనరా బ్యాంక్‌లో రూ. 60వేల పంట రుణం తీసుకున్న. మా కుటుంబంలో ఎవరికీ రుణమాఫీ కాలేదు. సీఎం రేవంత్‌రెడ్డి 2018 డిసెంబర్ నుంచి 2023 డిసెంబర్ వరకు మాఫీ వర్తిస్తుందని చెప్పిండు. రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. నాతోపాటు మా ఊర్లో చాలా మంది రైతులకు లక్ష లోపు రుణాలు మాఫీ కాలేదు.

**- చిన్నుబాయి, మాజీ సర్పంచ్, నారాయణపూర్**

## ● ఉద్యోగ భద్రత కల్పించాలి



*తమకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గురువారం ఆశ వర్కర్లు ఆందోళన నిర్వహించారు. ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ఎదుట ఆందోళన నిర్వహించి అందుబాటులో ఉన్న ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించారు. బోధన్‌లో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఎల్లారెడ్డిలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, నిజామాబాద్‌లో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, అర్బన్‌లో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. 20ఏండ్లుగా వెట్టిచాకిరి చేస్తున్న తమకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.*

*– బోధన్‌రూరల్/ఆర్మూర్‌టౌన్/ఖలీల్‌వాడి/బాన్సువాడ, జూలై 18*

## కలెక్టర్‌కు జాతీయ మానవ హక్కుల కమిషన్ నోటీసు


ఆర్మూర్‌టౌన్, జూలై 18: ఆర్మూర్ మండలంలోని చేపూర్ గ్రామంలో 2022 ఆగస్టులో బాలికపై జరిగిన లైంగికదాడి ఘటనలో జాతీయ మానవ హక్కుల కమిషన్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుకు గురువారం నోటీసులు జారీ చేసింది. లైంగికదాడి ఘటనలో బాధితురాలికి పరిహారం చెల్లింపులో కాలయాపన జరుగుతున్నదని వరంగల్‌కు చెందిన పౌర హక్కుల సంఘం సభ్యుడు బక్క జడ్సన్ జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై నివేదిక కోరుతూ కమిషన్ జిల్లా కలెక్టర్‌కు సమన్లు జారీ చేసినట్లు బక్క జడ్సన్ తెలిపారు.



నవీపేట మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న గుత్ప, అలీసాగర్ లిప్టు ఇరిగేషన్ కార్మికులు

# విద్యాశాఖలో లొల్లి

- డీఈవో వర్సెస్ ఉపాధ్యాయులు
- బజారు పాలవుతున్న విద్యాశాఖ తీరు



నిజామాబాద్, జూలై 18(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఒకవైపు జిల్లా విద్యాశాఖాధికారి. మరోవైపు ప్రభుత్వ ఉపాధ్యాయులు. ఇరువురు ప్రజల పన్నులతో వచ్చే సర్కారు వారి ఆదాయంతో జీతాలు తీసుకుంటున్న వారే. విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ ఎంతో సామాజిక బాధ్యతగా చేయాల్సిన పనిని వదిలి జగడం సృష్టిస్తున్నారు. ఉద్యోగ ధర్మాన్ని వదిలి నిత్యం కొట్లాటలతో రచ్చ కెక్కుతున్నారు. డీఈవోతోనే పోరు సాగిస్తూ కొంతమంది ఉపాధ్యాయులు చెడ్డ పేరును తెచ్చుకుంటుండగా... పంతుళ్లతో ఘర్షణకు దిగుతూ డీఈవో స్థాయి వ్యక్తే ఠాణా వరకు వెళ్లడం ఇప్పుడు చర్చనీయాంశం అవుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీ వ్యవహారాల్లో ఈ తతంగం మరింత ముదరడంతో విద్యాశాఖ పరువు బజారు పాలైంది. వృత్తి ధర్మాన్ని మరిచి పైస్థాయి అధికారితో కొంతమంది ఉపాధ్యాయ సంఘాల పేరుతో దురుసుగా, కటువుగా వ్యవహరించడం ఇప్పుడు వివాదాస్పదమైంది. టీచర్లతో ఘర్షణకు దిగి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో డీఈవో తీరు రాష్ట్ర స్థాయిలో చర్చకు దారితీసింది.

**ప్రజాపాలనలో వైచిత్రి..**

రాష్ట్రంలో ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో చిత్ర విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా పరిస్థితులు దాపురించాయి. ఇందుకు నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ ఉదంతమే మచ్చుకు ఉదాహరణగా నిలుస్తున్నది. సమీకృత కలెక్టరేట్‌లో కొలువుదీరిన విద్యాశాఖపై ఉన్నతాధికారుల నియంత్రణ కూడా లేకపోవడమూ కారణమవుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని బదిలీలను చేపడుతుండగా నిజామాబాద్ జిల్లాలో ఈ తంతు మాయని మచ్చగా మారుతున్నది. విద్యాశాఖలో రిలీవింగ్ ఆర్డర్లకు ఎంఈవోలు డబ్బులు వసూలు చేయడం, సీనియారిటీలో లోపాలు అడుగడుగునా బహిర్గతమవుతున్నా.. కాంగ్రెస్ పాలకులు దృష్టి సారించడం లేదు. దీంతో విద్యాశాఖలో వ్యవస్థ కుప్పకూలినట్లయ్యింది. అందుకే గతంలో ఎక్కడా, ఎప్పుడూ జరగని విధంగా వేధింపుల పేరిట ఏకంగా డీఈవో టీచర్లపై ఫిర్యాదు చేయడం గమనార్హం.

**దొందూ దొందే..**

ఉమ్మడి జిల్లాలోని విద్యాశాఖలో ప్రస్తుతం దొందూ దొందే అన్నట్లుగా పరిపాలన నడుస్తున్నది. ఓ వైపు విద్యాశాఖ అధికారులు, మరోవైపు ఉపాధ్యాయ సంఘాల్లోని కొంతమంది నాయకుల తీరు ఇందుకు కారణంగా మారుతున్నది. టీచర్ల పక్షాన నిలబడి వారి సమస్యల కోసం పోరాటం చేయాల్సిన వారు ఉన్నతాధికారులకు వంత పాడుతుండడంతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు. సమస్యలపై ఎవరైనా గళం విప్పితే ఒంటిగా చేసి టార్గెట్ చేస్తున్న ఘటనలు కూడా ఉభయ జిల్లాలో వెలుగు చూస్తున్నాయి. బదిలీ వ్యవహారాల్లో కామారెడ్డిలో పెద్ద ఎత్తున ఎంఈవోలు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇందులో కొంతమంది నాయకుల పాత్రను తీసి పారేయలేం అంటూ బాహాటంగానే టీచర్లు వాపోతున్నారు.

### వెలుగులోకి డీఈవో ఫిర్యాదు..

ఖలీల్‌వాడి, జూలై 18: కొంతమంది ఉపాధ్యాయులు తనను మానసికంగా వేధిస్తున్నారని డీఈవో దుర్గాప్రసాద్ ఈ నెల 1న రూరల్ పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు గురువారం వెలుగులోకి వచ్చింది. విశ్రాంత ఉపాధ్యాయుడు శంతన్, రావుట్ల ఉపాధ్యాయుడు బాలయ్య, వెల్మల్ ఉపాధ్యాయుడు ఓమాజీ తనపై వ్యక్తిగతంగా తప్పుడు ప్రకటనలు చేస్తున్నారని డీఈవో పేర్కొన్నారు. తనను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని, ప్రతి విషయానికి కార్యాలయంలోకి వచ్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. దీంతో తన కుటుంబసభ్యులు సైతం ఒత్తిడికి గురవుతున్నారని, వారి ఒత్తిడి తట్టుకోలేక ఫిర్యాదు చేసినట్లు డీఈవో ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డీఈవో ఫిర్యాదుపై రూరల్ ఎస్సై మహేశ్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# వేతన బకాయిలను వెంటనే చెల్లించాలి

- ఐదు నెలలుగా అందని జీతం
- మూడు రోజులుగా కొనసాగుతున్న కార్మికుల సమ్మె

నవీపేట, జూలై 18: ఐదు నెలలుగా బకాయి ఉన్న వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ నవీపేట మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద గుత్ప, అలీసాగర్ లిఫ్టు ఇరిగేషన్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వర్కర్స్ యూనియన్ నాయకుడు గణేశ్ మాట్లాడుతూ జిల్లాలోని గుత్ప, అలీసాగర్ లిఫ్టు ఇరిగేషన్‌లో ఎలక్ట్రీషియన్, పంప్‌హౌస్ ఆపరేటర్లు, వాచ్‌మన్లు, గార్డెన్ క్లీనర్లతో కలుపుకొని 120 మంది కార్మికులు నిత్యం పని చేస్తున్నారన్నారు. ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబసభ్యులతో సహా పస్తులుండాల్సిన పరిస్థితి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి కలెక్టర్ ద్వారా తమ సమస్యలను విన్నవించినా ఫలితం లేదని అన్నారు. లిఫ్టుల కాంట్రాక్టర్ కిశోర్‌రెడ్డికి తమ సమస్యలను వివరించినా పట్టించుకోవడంలేదని కార్మికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మూడు రోజుల నుంచి సమ్మె చేపడుతున్నామని పేర్కొన్నారు. అనంతరం ధర్నా చౌక్ నుంచి తహసీల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం తహసీల్దార్ నారాయణకు వినతిపత్రం అందజేశారు. కార్మిక నాయకులు గణేశ్, కార్తీక్, సందీప్, జగదీశ్, కార్మికులు పాల్గొన్నారు.